భక్తిశ్రద్ధలతో బక్రీద్



ప్రార్థనల్లో మాట్లాడుతున్న ప్రభుత్వ ఖాజీ

- ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు
- తరలివచ్చిన ముస్లింలు



ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

చిత్తూరు రూరల్: నగరంలో బక్రీద్ పండుగను గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈద్గా, మసీదులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత ముస్లింలు మత పెద్దతో కలసి పెద్దఎత్తున ర్యాలీగా గిరింపేటలోని ఈద్గా మైదానానికి చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వయోభేదం లేకుండా ఒకొరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు (ఈద్ ముబారక్) చెప్పుకున్నారు.

త్యాగానికి ప్రతీక

బక్రీద్ ప్రాముఖ్యతను ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జుహారీ ఆధ్యాత్మిక సందేశమిచ్చారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని, ముస్లింలు విధిగా నమాజు చేయాలన్నారు. అల్లాహ్ ప్రబోధించిన మార్గాన్ని అనుసరించాలన్నారు. నీతి నిజాయితీతో జీవించాలని, హింసాప్రవృత్తికి దూరంగా ఉండాలన్నారు. సేవాగుణంతో పదిమందికీ మంచి చేయాలని హితోక్తులు పలికారు. అలాగే నగరంలోని మిట్టూరు, సుబేదార్ వీధి, రామ్‌నగర్‌కాలనీ, గంగనపల్లె, తేనెబండ, బజారు వీధిలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచి మసీదులు కిటకిటలాడాయి.

పేదలకు మాంసం పంపిణీ

బక్రీద్‌రోజున ముస్లింలు పొట్టేలు, మేకపోతు మాంసాన్ని ఖుర్బానీ ఇవ్వడం పరిపాటి. బంధువులు, పేదలకు మాంసాన్ని పంచారు. అలాగే మధ్యాహ్నం మతాలకు అతీతంగా సహపంక్తి భోజనం చేసి మత సామరస్యాన్ని చాటారు.

ట్రాఫిక్ మళ్లింపు

గిరింపేటలోని ఈద్గా మైదానంలో ముస్లింలు పెద్ద ఎత్తున తరలివస్తారని పోలీసుశాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చిత్తూరు–వేలూరు రహదారి వైపు వచ్చే వాహనాలను బైపాస్ మీదుగా మళ్లించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

బక్రీద్ వేడుకల్లో ఎమ్మెల్యే

చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఈద్గాలో ముస్లింల ప్రార్థనలకు హాజరయ్యారు. మైనారిటీలకు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిని వివరించారు. చిత్తూరు ప్రజలందరూ కలసిమెలసి ఉండాలని కోరారు. అనంతరం ఆయనను ఈద్గా కమిటీ ఘనంగా సన్మానించింది.

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

బంగారుపాళెం: మండలవ్యాప్తంగా గురువారం బక్రీద్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం 7.30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి ముస్లింలు బంగారుపాళెం జామియా మసీదు వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రదర్శనగా మొగిలివెంకటగిరి గ్రామం సమీపంలో ఉన్న ప్రత్యేక ప్రార్థనా స్థలం (ఈద్గా)కు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. హజరత్ బక్రీద్ పండుగ విశిష్టతపై సందేశమిచ్చారు. అల్లా ఆదేశాల ప్రకారం ఇబ్రహీం ప్రవక్త తన కుమారుడైన ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి తీసుకువెళ్లే సంప్రదాయాన్ని స్మరిస్తూ ప్రపంచంలో బక్రీద్‌ను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను జరుపుకుంటారని అన్నారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పేదలకు దేవుని పేరుమీద ఖుర్బానీ ఇచ్చారు.

పూతలపట్టులో

పూతలపట్టు: మండలంలో గురువారం బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం మసీదు, ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు దాన ధర్మాలు చేశారు.

యాదమరిలో...

యాదమరి: మండలంలో బక్రీద్‌ను గురువారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం యాదమరి, చిన్నిరెడ్డిపల్లె ముస్లింవాడ, బుడితిరెడ్డిపల్లె ముస్లింవాడ, నూరేనగర్, 12 కమ్మపల్లె ముస్లింవాడ, రసూల్ నగర్, వరదరాజులపల్లె ముస్లింవాడల్లో మసీదులు, దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మధ్యాహ్నం పలువురికి దానధర్మాలు చేశారు.



ఈద్గాలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



పూతలపట్టు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు



నారసింహనపల్లెలో ప్రభుత్వ పథకాల గురించి వృద్ధురాలికి వివరిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే

- గడప గడపకు అందిన నవరత్నాల ఫలితాలు
- సమస్యల పరిష్కారానికి పెద్దపీట
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



యువతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

తవణంపల్లె: రాష్ట్రవ్యాప్తంగా నవరత్నాల పథకం ద్వారా ప్రతి కుటుంబం లబ్ధి పొందడంతో వారి ముఖాల్లో వెలుగులు నిండుకున్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నలిశెట్టిపల్లె పంచాయతీలోని నారసింహనపల్లె, తెల్లగుండ్లపల్లె పంచాయతీలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడప వద్దకు ప్రజలతో మమేకమయ్యారు. వారికి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించి, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మీ సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే మీ ఇంటికి వచ్చానంటూ ప్రజల మధ్య గడిపారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న పథకాలు మీకు అందుతున్నాయా ? లేదా ? అని ఆరా తీశారు. అన్ని పథకాలు అందుతున్నాయని ప్రజలు ముక్తకంఠంతో సంతోషంగా చెప్పారు. నవరత్నాలతో పాటు మరిన్ని పథకాలు మీ ఇంటికి రావాలంటే వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోసారి సీఎంగా చేయాలని కోరారు. జగనన్న సీఎంగా ఉంటేనే మనమంతా సంతోషంగా ఉండగలమని భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలు..

నారసింహనపల్లెలో 11 కేవీ లైను నివాసం ఉన్న ఇంటికి దగ్గరగా ఉండడంతో తొలగించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ 11 కేవీ లైన్‌ను వెంటనే తొలగించాలని పైపల్లె ఏడీఈ సుబ్రమణ్యం, ఏఈ కిరణ్ ఆదేశించారు. అదేవిధంగా సిమెంటు రోడ్లు నిర్మించాలని, ఇంటి స్థలం కేటాయించి పట్టాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలని తెల్లగుండ్లపల్లె పంచాయతీలోని ఎస్సీలు కోరారు. సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, అదనంగా కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని, రోడ్లు బాగు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామాల్లో యువతతో ఉత్సాహంగా మాట్లాడి జగనన్నకు యువత సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, భూ రీసర్వే డీటీ వెంకటరమణ, ఏఓ ప్రవీణ్, ఏపీఎం రవి, ఏపీఓ లలిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఈశ్వర్, పీఆర్‌ఏఈ గురువారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, మండల కన్వీనర్ సి.హరిరెడ్డి, ప్రకాష్ బాబురెడ్డి, పరమేశ్వరరెడ్డి, మధుకుమార్, రవిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రంజిత్‌రెడ్డి, సుజిత్‌రెడ్డి, కోదండ, ఉమాపతినాయుడు, కృష్ణమూర్తి, జనార్దన్, జీవా, పూర్ణచంద్ర, వరదరాజులు, బాలాజీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, వలంటీర్లు, గృహసారథులు, పంచాయతీ సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

మండలంలోని పల్లెచెరువు పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని ఎంపీపీ గీతారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

ఘనంగా కుంభాభిషేకం



గుడిపాల: మండలంలో చింతగుంటూరులోని వినాయకస్వామి ఆలయంలో గురువారం ఘనంగా కుంభాభిషేకం నిర్వహించారు. గణపతిపూజ, అంకురార్పణ, గోపూజ చేశారు. అనంతరం వినాయకస్వామి విగ్రహప్రతిష్ఠ, కుంభాభిషేకం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జిల నియామకం

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఆ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు వెల్లడించారు. వీరు గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులను సమన్వయం చేసుకుని పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

చిత్తూరు నియోజకవర్గం:

చిత్తూరు నగరం:

1–25 డివిజన్లు	: రాంగణేష్
25–50 డివిజన్లు	: కోలాకిరణ్
చిత్తూరు రూరల్	: సుధీర్‌రెడ్డి
గుడిపాల	: విజయకృష్ణ

పూతలపట్టు నియోజకవర్గం:

బంగారుపాళ్యం	: టి.సోమశేఖర్
ఐరాల	: కే.ప్రతాప్‌రెడ్డి
పూతలపట్టు	: ఎం.సుధాకర్‌రెడ్డి
తవణంపల్లె	: ఎస్.హరికృష్ణరెడ్డి
యాదమరి	: ఎం.మనోహర్‌రెడ్డి

మున్సిపల్ ఉద్యోగినంటూ మోసం



సీసీ పుటేజీలో రికార్డైన మోసగాడు

పలమనేరు: తాను మున్సిపల్ ఉద్యోగినంటూ రూ.6 వేలకు దుస్తులు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా బురిడీ కొట్టిన వైనం పట్టణంలోని లక్ష్మీనారాయణ సిల్క్ ప్యాలెస్‌లో జరిగింది. గురువారం వెలుగు చూసిన ఈ మోసంపై సిల్క్ ప్యాలెస్ యజమాని శివకుమార్ కథనం .. లక్ష్మీనారాయణ సిల్క్ ప్యాలెస్‌లోకి ఖరీదైన తెల్లటి దుస్తులు ధరించిన వ్యక్తి వచ్చి తాను స్థానిక మున్సిపాలిటీలో ఉద్యోగినని, తన పేరు రాంబాబు అని పరిచయం చేసుకున్నాడు. తనకు రామ్‌రాజ్ బ్రాండెడ్ దుస్తులు కావాలంటూ రూ.6వేలకు కొన్నాడు. బిల్లు చెల్లించే సమయంలో తన వ్యాలెట్‌లో డబ్బులు లేవని సిబ్బందితో ఇప్పుడే పంపిస్తానంటూ నమ్మబలికాడు. తన సెల్‌నంబరు 8099555111ను వారికిచ్చాడు. ఆయన బిల్డప్ చూసి నిజమేనని నమ్మి మళ్లీ పంపండంటూ యజమాని శివకుమార్ తెలిపారు. ఎంతసేపటికీ ఎవరూ డబ్బులు తీసుకురాకపోవడంతో ఆయన ఇచ్చిన సెల్ నంబర్‌కు ఫోన్ చేస్తే ×రాంగ్‌నెంబర్ అని తమది రాజమండ్రి₹ అనే సమాధానం వచ్చింది. దీంతో మున్సిపల్ కార్యాలయం వెళ్లి రాంబాబు అనే ఉద్యోగి ఉన్నాడా? అని అడిగితే, అలాంటి వాళ్లెవరూ లేరనే సమాధానం వచ్చింది. దీంతో మోసపోయానని భావించిన యజమాని షాపులోని సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా జరిగిన మోసాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. తనలాగా ఇంకెవరూ మోసపోకూడదంటూ అందులో పేర్కొన్నాడు. జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

గల్లంతై శవమయ్యాడు

పెద్దపంజాణి: స్నేహితులతో కలసి పెద్దవెలగటూరు క్వారీ వద్దకు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయిన పుంగనూరుకు చెందిన సయ్యద్‌బాషా మృతదేహం ఆచూకీ లభ్యమైందని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు వివరాలు.. పుంగనూరు మున్సిపల్ పరిధి నానాసాబ్ పేటకు చెందిన కరీంసాబ్ కుమారుడు సయ్యద్‌బాషా(36) స్నేహితులతో కలసి పెద్దవెలగటూరు సమీపంలోని క్వారీ గుంతలో ఈతకు వెళ్లి మంగళవారం గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పుంగనూరు ఫైర్ స్టేషన్ ఆఫీసర్ సుబ్బరాజు సిబ్బందితో కలసి గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో బుధవారం రాత్రి క్వారీ గుంతలో శవాన్ని చూసిన గ్రామస్తులు పెద్దపంజాణి పోలీసులకు సమాచారం చేరవేశారు. కుటుంబ సభ్యులతో కలసి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సైదాని ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధర్మకర్తలి మండలి సమావేశం రేపు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ధర్మకర్తలి మండలి సమావేశం జూలై 1న శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆలయ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి ఆలయ ధర్మకర్తలి మండలి సభ్యులు, అధికారులు అంతా హాజరు కావాలని కోరారు.

సుందరీకరణ పనులు వేగవంతం చేయండి

– కమిషనర్ అరుణ



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నగర కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్ : నగరంలో సుందరీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ అరుణ ఆదేశించారు. సీఎం పర్యటన నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో చేస్తున్న పనులను గురువారం ఆమె పరిశీలించారు. పనులను శుక్రవారం సాయంత్రం వేళకు పూర్తి చేయాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. గంగినేనిచెరువు, డెయిరీ వద్ద రోడ్డు పనులను పరిశీలించారు.

సింహ వాహనంపై శ్రీరాముడి విహారం



సింహ వాహనం సేవలో పాల్గొన్న ఉభయదారులు, స్థానికులు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండ రాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి హంస వాహనంపై శ్రీరాముడు విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ఉదయం ఆలయంలో సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అర్చకులు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఉభయదారులచే స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం, సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి ఉభయదారులు కృష్ణమాచారి నేతృత్వంలో స్వామివారి సింహ వాహన సేవ జరిగింది. అలాగే ఉభయదారులు రాత్రి స్వామివారికి పూజాసామగ్రి, ప్రసాదాలు, సుగంధపుష్పాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం అర్చకులు ఉత్సవమూర్తి శ్రీరాముడికి అభిషేకం, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. సర్వాంగ సుందరంగా ముస్తాబైన శ్రీరాముడు సింహ వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారికికి భక్తులు ఇంటింటా పూజలు చేసి, కొబ్బరి కాయలు కొట్టి కర్పూరహారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు హనుమంత వాహనసేవ

కోదండరాములు దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉభయదారులచే ఉదయం స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం ఉంటుందని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి తెలిపారు. అలాగే సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రి హనుమంత వాహన సేవ జరుగుతుందన్నారు.

డ్వాక్రా గ్రూపులకు రూ.10 కోట్ల రుణాల పంపిణీ



చెక్కు ఇస్తున్న ఎస్‌బీఐ అధికారులు

పలమనేరు: మండలంలోని బేరుపల్లెలో బుధవారం సాయంత్రం డ్వాక్రా మహిళలకు స్థానిక ఎస్‌బీఐ ద్వారా రూ.10 కోట్ల రుణాలను మహిళా గ్రూపులకు పంపిణీ చేశారు. చీఫ్ మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రుణాలను సకాలంలో చెల్లిస్తే బ్యాంకులు పరిపుష్టిగా ఉంటాయన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకుని ఆదాయ మార్గాలుగా వినియోగించుకోవాలని సూచించారు. బ్రాంచ్ మేనేజర్ హరికృష్ణ, ఏపీఎం మొగిలయ్య, సీసీ హరి, ఆత్మా చైర్మన్ గోవిందురెడ్డి, గ్రామ సర్పంచ్ మునిస్వామి, మాధవరెడ్డి, వెలుగు సిబ్బంది, మహిళా గ్రూపులు పాల్గొన్నాయి.

చిత్తూరు అభివృద్ధికి సమష్టి కృషి చేయాలి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర అభివృద్ధికి సమష్టి కృషి చేయాలని చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు అన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చిత్తూరుకు తాగునీటి తెచ్చే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. విద్యాసంస్థలు, హైరోడ్డు విస్తరణ, రైల్వే అభివృద్ధి పనులు చేయాలన్నారు. అలాగే కేంద్రీయ విద్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, ప్రభుత్వ వైద్యశాలను మంజూరు చేయాలన్నారు. మహవీర్ బ్రిడ్జి పునఃనిర్మాణ పనులకు పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సభ్యులు తాండవమూర్తి, శివకుమార్, అశోక్‌కుమార్, కుమరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాసం విత్తనాల పంపిణీ

బంగారుపాళెం: రైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ విజయమోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని పశువైద్య కేంద్రాలు, రైతుభరోసా కేంద్రాల్లో 75 శాతం రాయితీపై మొక్కజొన్న, జొన్న విత్తనాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రాయితీ పోను 5 కేజీల మొక్కజొన్న రూ.85, జొన్నలు 5 కేజీలు రూ.90 అన్నారు. పశుగ్రాస విత్తనాలు అవసరమైన రైతులు పట్టాదారు పాసుబుక్, ఆధార్ జిరాక్స్‌లు తీసుకెళ్లి విత్తనాలు పొందవచ్చన్నారు.

గడ్డివామి దగ్ధం



వెదురుకుప్పం: మండలంలోని ఆళ్లమడుగు దళితవాడలో గురువారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో చెంగయ్యకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. పశువుల మేత కోసం ఇంటి సమీపంలో గడ్డిని నిల్వ చేశారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ఘటనలో గడ్డివామి పూర్తిగా కాలిబూడిదైంది. దీంతో రూ.25 వేలు నష్టం వాటిల్లింది.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

పులిచెర్ల(కల్లూరు): టీటీడీ అనుబంధంలోకి తీసుకున్న మండలంలోని మంగళంపేట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు పరిశీలించారు. కొత్తగా గాలిగోపురం, గర్భగుడి, మండపాన్ని రూ.1.98కోట్లతో నిర్మిస్తున్నారు. పనులను టీటీడీ చీఫ్‌ఇంజినీర్ నాగేశ్వరరావు, ఈఈ వేణుగోపాల్, డీఈ సర్వేష, ఏఈ వెంకటేశన్, కాంట్రాక్టర్ సూరిబాబు, సర్పంచ్ మధు పరిశీలించారు.

వడదెబ్బకు ఉపాధి కూలీ మృతి



ఈశ్వరి మృతదేహం

తవణంపల్లె: మండంలంలోని టి.పుత్తూరు దళితవాడకు చెందిన ఓ మహిళ ఉపాధి పనులు చేస్తూ వడదెబ్బకు గురై గురువారం మృతి చెందింది. మండలంలోని మారేడుపల్లె చెరువు సప్లయ్ ఛానల్‌లో గురువారం టి.పుత్తూరు గ్రామస్తులు, టి.పుత్తూరు దళితవాడకు చెందిన సుమారు 60 మంది కూలీలు పూడికతీత పనులు చేపట్టారు. గత మూడు రోజులుగా ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో టి.పుత్తూరు దళితవాడకు చెందిన కె.ఈశ్వరి(47) ఉపాధి పనులు చేస్తుండగా అకస్మాత్తుగా అపస్మారక స్థితిలోకి వెళ్లి కింద పడిపోయింది. ఉపాధి పనులు చేస్తున్న కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్ హుటాహుటిన తవణంపల్లె పీహెచ్‌సీ తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థిమి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే ఈశ్వరి మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఉపాధి పనుల్లో హుషారుగా పనులు చేసే ఈశ్వరి అకస్మాత్తుగా కింద పడి మరణించడంతో కూలీలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఏపీఓ లలిత ఫిర్యాదు మేరకు తవణంపల్లె తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, వీఆర్‌ఓ రాజశేఖర్ మృతదేహాన్ని పరిశీలించి జిల్లా అధికారులకు రిపోర్టు పంపుతామని తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.





ఖరీఫ్ పనులు ముమ్మరం

మండలంలో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి కొందరు రైతులు దుక్కి దున్నుతుండగా మరికొందరు వ్యవసాయ పనిముట్లను తయారు చేసుకుంటున్నారు. కూలీలు పొలాల్లో చెత్తాచెదారం తొలగిస్తూ పొలానికి సేంద్రియ ఎరువును పోస్తున్నారు. కొంతమంది రైతులు ఖరీఫ్‌కు విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. మరికొంత మంది ట్రాక్టర్ల ద్వారా వేరుశనగ విత్తనాలను విత్తుతున్నారు.

- గుడిపాల

ద్రౌపదీదేవి పుర విహారం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న ద్రౌపదీదేవి

కార్వేటినగరం: మహాభారత వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం ద్రౌపదీ అమ్మవారు ప్రత్యేక వాహనంపై కొలువుదీరి గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వేకువజామున సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఉభయదారులైన కరిణికులు సమర్పించిన పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై అమ్మవారిని ప్రతిష్టించి మంగళవాయిద్యాల నడుమ, బాణసంచా పేలుస్తూ అంగరంగ వైభవంగా ఊరేగించారు. అలాగే భాగవతారిణి రెడ్డెమ్మ హరికథా గానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పోకల సోమనాథ్, కమిటీ సభ్యులు, ఉభయదారులు పాల్గొన్నారు.